ఇంటర్ విద్యపై సర్కారు నిర్లక్ష్యం

- కాలేజీల్లో క్లాసులు మొదలైనా కూడా పుస్తకాలివ్వరా?
- గెస్ట్ ఫ్యాకల్టీలను రెన్యువల్ చేయాలి: మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఇంటర్ విద్యపై సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ కాలేజీలు ప్రారంభమై మూడు వారాలు కావస్తున్నా విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకపోవటం బాధ్యతారాహిత్యమేనన్నారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌వేదికగా స్పందించారు. రాష్ట్రంలో ఇంటర్ కాలేజీల్లో 1654 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను రెన్యువల్ చేయాలని, కొత్తగా మంజూరైన జూనియర్ కాలేజీల్లో పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకునే ప్రభుత్వానికి విద్య, విద్యార్థుల భవిష్యత్తుపై ఏమాత్రం చిత్తశుద్ధిలేదని, 422 జూనియర్ కాలేజీల్లో లక్షా 60 వేల మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులు చదువుతున్నారని, వారికి నాణ్యమైన విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని కొన్ని జూనియర్ కాలేజీల్లో మొదటి ఏడాది జీరో అడ్మిషన్స్ నమోదవడంపై దృష్టి సారించి ఇంటర్మీడియెట్ విద్యను బలోపేతం చేసేందుకు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు తీర్చాలి

- ఉద్యోగులను పర్మినెంట్ చేసి భరోసా కల్పించాలి
- 21న క్యాబినెట్ భేటీలో నిర్ణయాలు తీసుకోవాలి
- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి డిమాండ్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఈ నెల 21న జరిగే క్యాబినెట్ భేటీలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఉద్యోగులకు పర్మినెంట్ జీతభత్యాలు, భరోసా విషయంలో స్పష్టత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వంగపల్లి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ, గ్రామీణ మున్సిపాలిటీల్లో నూటికి 80 శాతం దళిత అణగారినవర్గాల వారే విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించినప్పుడే ఈ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అవుతుందని చెప్పారు. కార్మికులకు నెలకు రూ.5000 పింఛన్ ఇవ్వాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా వారిని గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎమ్మార్పీఎస్ వారికి అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు దయాకర్ కాసర్ల, సురేశ్, విద్యార్థి నాయకులు కొల్లూరు వెంకట్, వరిగడ్డి చందు, జీవన్, ధర్మారం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానల్లో జీతాలు బంద్

- 3 నెలలుగా అందని వేతనాలు
- సిబ్బందికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు
- వేతనాలు ఇవ్వాలని వేడుకోలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పట్టణ పేదలకు వైద్యం అందించే బస్తీ దవాఖానల్లో సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. మార్చి, ఏప్రిల్, మే వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, కుటుంబపోషణ, పిల్లల ఫీజులు, ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. తమకు వేతనాలు ఇవ్వాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. 'నా భర్త కొన్నేండ్ల కింద చనిపోయిండు. నాకు ఇద్దరు పిల్లలు. కుటుంబానికి నా సంపాదనే ఆధారం. వచ్చే రూ. 8వేల జీతం కుటుంబపోషణకు కూడా సరిపోవడం లేదు. మూడు నెలలుగా ఆ జీతం కూడా రాక అప్పు చేస్తున్న. ఇంకా ఎన్నిరోజులు ఇట్లా నెట్టుకురావాలో అర్థమైతలేదు' అని మల్కాజిగిరి పరిధిలోని ఓ బస్తీదవాఖాన సహాయకురాలు కన్నీరు మున్నీరయ్యారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10వేల జనాభాకు ఒకటి చొప్పున బస్తీ దవాఖానను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించింది. జీహెచ్‌ఎంసీతోపాటు మున్సిపాలిటీల్లో కలిపి 400కుపైగా బస్తీ దవాఖానలు పనిచేస్తున్నాయి. ఒక్కో దవాఖానలో డాక్టర్ లేదా ఎంఎల్‌హెచ్‌పీ, ఫార్మసిస్టు, సహాయకులు ఉంటారు. వీరికి ఈ ఏడాది మార్చి నుంచి వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఇసుక కోసమే మేడిగడ్డను ఎండబెట్టారు

- బరాజ్ మరమ్మతులను అందుకే జాప్యం చేస్తున్నారు
- ఇసుక టెండర్లపై పునఃసమీక్ష జరపాలి
- బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలి
- మీడియా సమావేశంలో మాజీ ఎంపీ బాల్క సుమన్

తెలంగాణభవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ బాల్క సుమన్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, తుంగ బాలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇసుక తవ్వకాల కోసమే మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేయకుండా విలువైన సమయాన్ని వృథా చేస్తున్నదని, పైపెచ్చు గత బీఆర్ఎస్ సర్కారుపై నిందలు వేసేందుకు ప్రయత్నిస్తున్నదని మాజీ ఎంపీ బాల్క సుమన్ ధ్వజమెత్తారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మరో కుట్రకు తెర లేపిందని, మేడిగడ్డ బరాజ్ నుంచి 92 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించేందుకు టెండర్లు పిలిచిందని, ఇది గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలకు విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ నేతల జేబులు నింపేందుకు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని రేవంత్ సర్కారును డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా గతంలో ఎన్‌జీటీ ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేస్తూ.. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే కోర్టులను ఆశ్రయిస్తామని ప్రకటించారు. రైతులకు సాగునీరు అందించకుండా ఇసుకను దోచుకునే ప్రణాళికను కాంగ్రెస్ నేతలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇసుకతోపాటు అన్ని దందాల్లో కాంగ్రెస్ నేతలు కూరుకుపోయారని విమర్శించారు.

గనుల ధారాదత్తానికి కుట్ర

ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని వర్గాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల్లా తెలంగాణలోని గనులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాల్క సుమన్ నిప్పులు చెరిగారు. ఐరన్, సున్నపురాయి, మాంగనీసు గనుల వేలానికి గడువు విధిస్తూ కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, ఆ లేఖపై రేవంత్ సర్కారు తన వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు. ఈ నెల 21న దేశవ్యాప్తంగా 52 బొగ్గు బ్లాకులను వేయనున్నట్టు సమాచారం ఉన్నదని, వాటిలో సింగరేణి బ్లాకులు కూడా ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించేలా ప్రభుత్వం ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు గనులు సింగరేణికే ఉండాలని కేంద్రానికి ఎందుకు లేఖ రాయడం లేదని సీఎం రేవంత్‌ను నిలదీశారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీకి సున్నపురాయి గనులను, బయ్యారం స్టీల్‌ప్లాంట్‌కు ఇనుప ఖనిజాన్ని కేటాయించేలా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని కోరారు.

నీట్‌ను రద్దుచేసి.. మళ్లీ నిర్వహించాలి

నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. గొర్రెల కొనుగోలులో అవకతవకలు జరిగాయంటూ ఆ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జోక్యం చేసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ.. రూ.లక్షలతో నీట్ ప్రశ్నాపత్రాలను కొనుగోలు చేసినట్టు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులపై ఈడీ జోక్యం చేసుకోదా? అని ప్రశ్నించారు. నీట్ విషయంలో కూడా కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆయన ఆరోపిస్తూ.. ఈ పరీక్షపై సీఎం రేవంత్ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ ద్వారా తెలంగాణ విద్యార్థులు నష్టపోతున్నారని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు.

కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై ఏది?

రేవంత్‌రెడ్డికి కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదని.. ఆయన బీర్, బార్ సహా దేన్నీ వదలడంలేదని బాల్క సుమన్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు పంచ భూతాలను సైతం వదలకుండా సహజసంపదను దోచుకుంటున్నారని తూర్పారబట్టారు. సీఎం కోసం రూ.కోట్లతో హెచ్‌జీసీఎల్ భవనాన్ని ఆధునీకరిస్తున్నారని, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మరో భవనాన్ని నిర్మిస్తున్నారని ధ్వజమెత్తారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి, తుంగ బాలు కూడా పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు

- కావాలనే కొందరి దుష్ప్రచారం
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూన్ 19: ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ మారే ప్రసక్తే లేదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రెండు రోజులుగా టీవీలు, న్యూస్‌పేపర్లు, సామాజిక మాధ్యమాల్లో పార్టీ మారుతున్నానంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాలని కొందరు నాయకులు అడిగిన మాట వాస్తవమేనన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సారథ్యంలో గతంలో ఎలా పనిచేశామో.. ఇప్పుడు కూడా పార్టీ కోసం అలాగే పనిచేస్తామని చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ రాజశేఖర్, కౌన్సిలర్ మురళి, ఎంపీపీ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

144 మంది తెలంగాణ ఉద్యోగులను రిలీవ్ చేయండి : టీఎన్జీవో

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఏపీలో పనిచేస్తున్న 144 మంది తెలంగాణ ఉద్యోగులను వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం అమరావతి వెళ్లిన టీఎన్జీవో ప్రతినిధి బృందం ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. తమ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులను తిరిగి తమ రాష్ట్రానికి పంపించాలని తెలంగాణ ప్రభుత్వం గత శుక్రవారం కోరినందున, సాధ్యమైనంత త్వరగా ఆయా ఉద్యోగులను రిలీవ్ చేయాలని టీఎన్జీవో కేంద్రం సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఎండీ ముజీబ్ హుస్సేనీ కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ నగరశాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్, నర్సింహారెడ్డి, కొండల్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేందర్, ఖాజా, రజని తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆరోగ్యబీమా కల్పించాలి

క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ అసోసియేషన్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): చాలీచాలని వేతనం, పని ఒత్తిడి, ఉద్యోగ భద్రత లేకపోవడంతో సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లో ఉద్యోగులు పిట్టల్లా రాలిపోతున్నారని సమగ్రశిక్ష క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి నెల సగటున నలుగురు చొప్పున ఉద్యోగులు మృత్యువాత పడుతున్నారని అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రేగుల సహదేవ్ ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకు మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని, 10 లక్షల ఆరోగ్యబీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

10,083 మందికి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతుల్లో భాగంగా బుధవారం 10, 083 మందికి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు దక్కాయి. వీరికి జిల్లాల వారిగా పదోన్నతుల ఉత్తర్వులను విద్యాశాఖ అధికారులు అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో గ్రేడ్ -2 భాషాపండితులు, పీఈటీలు ఉన్నారు. పదోన్నతుల ఉత్తర్వులు అందుకున్నవారంతా బుధవారమే కొత్త స్థానాల్లో చేరారు.

పదోన్నతులపై పీఆర్టీయూ హర్షం

రాష్ట్రంలోని 10 వేలకుపైగా టీచర్లకు పదోన్నతులు కల్పించడంపై పీఆర్టీయూ తెలంగాణ హర్షం వ్యక్తంచేసింది. ఇందుకు సహకరించిన అధికారులు, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం చెన్నయ్య, భిక్షంగౌడ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు రైళ్లు రద్దు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్-కొల్లం, సికింద్రాబాద్-దానాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19, 21 తేదీల్లో ఈ రైళ్ల రాకపోకలు నిలుస్తున్నాయన్నారు. రైల్వే నిర్వహణ పనులతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని వివరించారు.

22న పీవోడబ్ల్యూ అర్ధశతాబ్ది ఉత్సవాలు

ఖైరతాబాద్, జూన్ 19 : బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 22న పీవోడబ్ల్యూ అర్ధశతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకురాలు సంధ్య తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వేడుకలకు సంబంధించిన పోస్టర్లను పీవోడబ్ల్యూ నాయకులు ఝాన్సీ, విమలక్క, సామాజిక కార్యకర్త సజయతో కలిసి ఆవిష్కరించారు. సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ రచయిత్రి భాషాసింగ్ హాజరవుతున్నారని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు.

నేడు అన్నారానికి సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బరాజ్‌కు సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం గురువారం రానుంది. బరాజ్ వద్ద బోర్‌వెల్ పనులను పరిశీలించనున్నారు. బరాజ్ వద్ద 35, 38, 42 గేట్ల వద్ద 25 మీటర్లలోతు వరకు బోర్‌హోల్ వేస్తూ మట్టి నమూనాలు సేకరించి పుణెలోని ల్యాబ్‌కు తరలించి పరీక్షించనున్నారు. వచ్చిన రిపోర్టును బట్టి బరాజ్ వద్ద పనులు చేపట్టనున్నారు.

గురుకులాలను ఎత్తేస్తే బీఆర్ఎస్ పోరాటం

- నిర్వీర్యం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం
- కేసీఆర్ పథకాలను రూపుమాపే ఎత్తుగడ
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం
- ఆరు గ్యారెంటీలు ఇవ్వకపోతే ఏడు చెరువుల నీళ్లు తాగిస్తాం: కౌశిక్

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నేత బొమ్మెర రామ్మూర్తి

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పేదపిల్లల కోసం రాష్ట్రంలో కేసీఆర్ బలోపేతం చేసిన గురుకులాలను ఎత్తివేస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టంచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మార్కు లేకుండా చేయాలన్న కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాలను నిర్వీర్యం చేసేపనిలో ఉన్నారని ధ్వజమెత్తారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మన గురుకులాలు ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ఏదో స్టడీ రిపోర్ట్ పేరిట గురుకుల విద్యను చిన్నాభిన్నం చేయాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో పెద్దఎత్తున ఎస్సీలకు 238, బీసీలకు 261, ఎస్టీలకు 261, మైనార్టీలకు 204 గురుకులాలను స్థాపించారని వివరించారు. ఒక్కో విద్యార్థిపై గురుకుల పాఠశాలల్లో రూ.1.20 లక్షలకు పైనే కేసీఆర్ ప్రభుత్వంలో ఖర్చు చేసినట్టు తెలిపారు. పోటీ పరీక్షల్లో ప్రభుత్వ గురుకులాల విద్యార్థులు సత్తా చాటుతున్నారంటే అది కేసీఆర్ విధానాల ఫలితమేనని స్పష్టంచేశారు. రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు తర్వాత ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ జరిగిందని, గతంలో 3,575 మంది ఉపాధ్యాయులు ఉంటే ఇప్పుడు 17,439 మంది ఉన్నారని తెలిపారు. జూనియర్, డిగ్రీ గురుకుల కళాశాలలు కేసీఆర్ సీఎం అయ్యాకే భారీగా పెరిగాయని చెప్పారు. గురుకుల విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇచ్చే వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. మన ఊరు మన బడి కేసీఆర్ హయాంలో పెట్టిన గొప్ప కార్యక్రమమని, అది కూడా కొనసాగిస్తారా? మూసేస్తారో? ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నేతలకు ఏడు చెరువుల నీళ్లు తాగిస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాజీ మంత్రి హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, గ్రూప్-1 నిర్వహణపై అవగాహన లేనిది జీవన్‌రెడ్డికేనని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పట్టభద్రులకు అన్యాయం చేసేలా మాట్లాడితే ఎట్లా అంటూ నిలదీశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నేత బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

రింగ్‌మేకర్ ఎవరు?

బీసీభవన్ వద్ద మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

నీట్ దేశంలోనే అతిపెద్ద స్కామ్

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ముషీరాబాద్, ఆగస్టు 7: నీట్ పరీక్ష దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. ఈ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావాలంటే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్ వద్ద ఆయన మాట్లాడుతూ 'నీట్ పరీక్ష రాసిన వారిలో ఏకంగా 67 మందికి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు రావడం, ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన విద్యార్థుల్లో 8 మంది తొలి ర్యాంకు సాధించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కొందరికి 720 మార్కులకుగాను 718, 719 మార్కులు రావడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. తప్పిదాలు బయటపడకుండా ఉండేందుకు లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజే నీట్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. నీట్ పరీక్ష రాసిన దాదాపు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆటలాడుతున్నది. నీట్ కుంభకోణం విషయాలు బయటికి రావాలంటే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరుపాలి' అని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నీల వెంకటేశ్, అనంతయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- మొదటిపేజీ తరువాయి...

కనిపిస్తున్నాయి. సౌమ్యుడిగా పేరున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ విషయంలో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అటో ఇటో తేల్చేయాలని పట్టుదలతో ఉన్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఒక శాఖకు చెందిన ఉన్నతాధికారులు మంత్రికి తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయాలు తీసుకోవడం అసాధ్యమని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఇదే సమయంలో మంత్రిని సైతం బైపాస్ చేసి విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తి ఎవరికి ఉంటుందని ఆరా తీస్తున్నారు. ఈ తతంగం మొత్తాన్ని ప్రభుత్వంలోని అత్యంత కీలక వ్యక్తి సన్నిహితుడు నడిపినట్టు ఎక్సైజ్ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ మొత్తం వ్యవహారంలో ఆ వ్యక్తే 'రింగ్ మాస్టర్'గా మారి చక్రం తిప్పారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

హెచ్చరికలు 'పైన' వ్యక్తులకేనా?

మంత్రి జూపల్లి ఆగ్రహానికి, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటివరకు ఏ శాఖలోనూ ఏ మంత్రి చేయని విధంగా ఏకంగా ఐదు గంటలపాటు ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించడం, సమావేశంలో ఘాటు వ్యాఖ్యలు చేయడానికి బలమైన కారణం ఉన్నదని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతుల ప్రక్రియ జూపల్లికి తెలియకుండా జరిగిందని ఎక్సైజ్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే ఆయన గత మే 21న ప్రెస్‌మీట్ పెట్టి కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వలేదని చెప్పడమే కాకుండా, మీడియా సంస్థలపై కేసులు పెడతామని బెదిరించారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. తీరా, కొత్త బ్రాండ్లకు అనుమతులు నిజమేనని తెలిసిన తర్వాత కంగుతిన్నారని, వారం రోజులకే తన వ్యాఖ్యలపై తానే వివరణ ఇచ్చుకోవాల్సిన ఇబ్బందికర పరిస్థితి ఎదురైందని చెప్తున్నారు. తనకే తెలియకుండా నిర్ణయాలు జరిగిపోవడాన్ని మంత్రి అవమానంగా భావించారని, రాష్ట్ర ప్రజలందరి ముందు తన పరువు పోయిందని తీవ్రంగా బాధపడ్డారని చెప్పుకుంటున్నారు. కొత్త బ్రాండ్లకు ఎవరు అనుమతులు ఇచ్చారో, ఎందుకు ఇచ్చారో నివేదిక తయారుచేయాలని ఆదేశించారని గుర్తుచేస్తున్నారు. ఈ హెచ్చరికలు అధికారులను ఉద్దేశించినవి కాదని, వారిని ప్రభావితం చేసిన 'రింగ్ మాస్టర్'కే అని చర్చ నడుస్తున్నది.

మింగలేక.. కక్కలేక..

ఎక్సైజ్ ఉన్నతాధికారుల పరిస్థితి 'మింగలేక.. కక్కలేక' అన్నట్టుగా తయారైందని చర్చ జరుగుతున్నది. మంత్రినే బైపాస్ చేసి నిర్ణయాలు అమలు చేసే శక్తి ఉన్నవారి పేర్లను బయటపెట్టలేక, మంత్రికి సర్దిచెప్పలేక నానా అవస్థలు పడుతున్నారని ఎక్సైజ్‌శాఖ వర్గాల్లో చెప్పుకుంటున్నారు. మంత్రి ఆదేశం మేరకు ఎవరు, ఎలా అనుమతులు ఇచ్చారో 'సాంకేతికంగా' నివేదిక సిద్ధం చేస్తున్నారని, అంతేతప్ప ఈ తతంగం వెనుక ఎవరున్నారనే అంశంపై ఎవరూ పెదవి విప్పడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఒకరిద్దరు ఉన్నతాధికారులపై వేటు వేసి కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఈ వ్యవహారం ఇప్పుడు నాలుగు గోడల మధ్య లేదని, ప్రజల్లోకి వెళ్లిపోయి చర్చ జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ లో ఆందోళన మొదలైనట్టు సమాచారం. ఒక వ్యక్తి చేసిన నిర్వాకం అటు ప్రభుత్వానికి, ఇటు పార్టీ మెడకు చుట్టుకుంటున్నదని, పార్టీకి నష్టం కలిగే ప్రమాదం ఉన్నదని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. ప్రజలు నమ్మి అధికారం కట్టబెడితే, ప్రభుత్వంలో మంత్రి పదవులకు ఇచ్చే విలువ ఇదేనా? అంటూ మండిపడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

క్రమంగా అలవాటు చేసేలా వ్యూహం?

కొత్త బ్రాండ్లకు అనుమతుల నిలుపుదల తాత్కాలికమేనని ఎక్సైజ్ శాఖలో చర్చ జరుగుతున్నది. కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చేముందు కావాలనే ప్రముఖ బ్రాండ్ల సరఫరా తగ్గించి కృత్రిమ కొరత సృష్టించారని గుర